ఎండైనా.. వానైనా..

ఆ బస్టాప్ నగరంలోనే కీలకమైనది. ద్వారకా బస్ స్టేషన్ తర్వాత ఆ స్థాయిలో ప్రయాణికుల రద్దీ ఉంటుంది. నగర పరిధితో పాటు ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులు ఇక్కడ నిరీక్షిస్తారు. అలాంటి బస్టాప్‌లో సౌకర్యాలు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్టాప్ ఆవరణను వాహనాల పార్కింగ్‌కు ఉపయోగిస్తున్నారు. ఫలితంగా ఎండైనా.. వానైనా ప్రయాణికులు రోడ్డుపైనే నిరీక్షించాల్సి వస్తోంది.



చినుకులు కురుస్తున్నా రోడ్డుపైనే బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

- బస్సుషెల్టర్ ముందు వాహనాల పార్కింగ్
- రహదారిపై పారుతున్న మురుగునీరు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

విశాఖ విద్య: నగరంలోని ఎన్‌ఏడీ బస్టాండ్‌లో ప్రయాణికుల ఇబ్బందులను ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ద్వారకా బస్‌స్టేషన్ తర్వాత ఆ స్థాయిలో ప్రయాణికులు రాకపోకలు సాగించే ఎన్‌ఏడీ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేకున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదు. ఆదాయమే తప్పా ప్రయాణికుల సమస్యలతో మాకేంటి అన్నట్లు ఆర్టీసీ అధికారులు వ్యవహరిస్తున్నారు.

ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే..

అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేచి ఉండేందుకు షెల్టర్లు ఉన్నా అవి సౌకర్యవంతంగా లేకపోవడంతో బస్సుల కోసం రహదారి పైనే నిరీక్షిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రహదారిపైనే మురుగునీరు

ఎన్ఎస్‌టీఎల్ వైపు ఉన్న బస్ షెల్టర్ ముందు రహదారిపైనే మురుగునీరు పారుతోంది. ఎన్ఎస్‌టీఎల్ రోడ్డుకు ఇరువైపులా వాహనాల వాటర్ సర్వీసింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఎన్ఎస్‌టీఎల్ గోడ వైపు ఉన్న సర్వీస్ సెంటర్ నుంచి వృథా నీరంతా రోడ్డుపైకే వదులుతున్నారు. 80 అడుగుల రోడ్ నుంచి వచ్చే నీరు దిగువకు పోయేందుకు **డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో మురుగునీరుంతా బస్టాప్ ముందు నుంచే వెళ్తోంది. బస్టాప్‌లోకి ప్రయాణికులు ఈ మురుగునీరు దాటి వెళ్లాల్సి** వస్తోంది. అదే సమయంలో ఆ దారిలో వచ్చే వాహనాలు తమపై మురుగునీరు కొట్టి పోతున్నాయని వాపోతున్నారు.

మరుగుదొడ్లు లేక ఇబ్బందులు

ప్రాధాన్యం కలిగిన ఎన్‌ఏడీ సెంటర్ బస్టాప్‌లో మరుగుదొడ్లు సదుపాయం లేదు. జీవీఎంసీ 52వ వార్డు అంబేడ్కర్ నగర్ వైపు ఉన్నా ఎన్ఎస్‌టీఎల్ రోడ్డు వైపు నుంచి అటు వెళ్లలేని పరిస్థితి. హైవేపై రయ్‌మని వచ్చేవాహనాల వల్ల అటుగా రోడ్డు దాటకుండా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో దూర ప్రాంతాల నుంచి బస్సులపై వచ్చి, ఎన్‌ఏడీ సెంటర్‌లోదిగే వారు మూత్ర విసర్జనకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కొంత మంది అయితే బస్సు దిగిన కొంత దూరంలో రోడ్డుపైనే మూత్ర విసర్జన చేస్తుండగా, అక్కడ ఉన్న ఆటోవాలాలు వారిని తీవ్రంగా మందలిస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి ప్రాధాన్యం కలిగిన ఎన్‌ఏడీ బస్టాప్‌లో సౌకర్యాలు మెరుగపర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్ షెల్టర్‌లో వాహనాల పార్కింగ్

రాజమండ్రి వైపు నుంచి నగరంలోకి వచ్చే బస్సులు ఆగే చోట(ఎన్‌సీటీఎల్ 80ఫీట్ రోడ్ వైపు) ఏర్పాటు చేసిన షెల్టర్ నిరుపయోగంగా మారుతోంది. హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి వంటి ప్రాంతాల నుంచి వచ్చే బస్సుల్లో ఎన్‌ఏడీ వద్ద ప్రయాణికులను దింపేందుకు ఇక్కడే బస్సులు నిలుపుతారు. అదే విధంగా ఎన్‌ఏడీ సెంటర్ నుంచి నగరంలోకి వచ్చే సిటీ సర్వీసులు ఎక్కేందుకు కూడా ప్రయాణికులు ఇదే షెల్టర్ వద్ద వేచి ఉంటారు. ఇలాంటి ప్రాధాన్యం గల బస్ షెల్టర్ ముందు ద్వి చక్రవాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. వీటిని దాటుకొని బస్ షెల్టర్‌లోకి వెళ్లడం ఇబ్బందికరంగా మారడంతో రోడ్డుపైనే బస్సుల కోసం నిలబడుతున్నారు. ఇంత సమస్య ఉన్నా ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ లేదా ఆర్టీసీ అధికారులకు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు.



బస్టాప్ ముందు నిలిపిన వాహనాలు

జీవీఎంసీ కమిషనర్‌తో జియ్యాని భేటీ



కమిషనర్‌కు అంబేడ్కర్ మైనపు విగ్రహం అందజేస్తున్న శ్రీధర్ తదితరులు

విశాఖ విద్య: మహా విశాఖ నగరపాలక సంస్థ కమిషనర్ సంపత్ కుమార్‌తో బుధవారం నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ భేటీ అయ్యారు. ఎస్‌ఏడీ షెడ్యూల్ కులాల సంఘాలు, అంబేడ్కర్ భవన్ సభ్యులతో కమిషనర్‌ను కలిసి అంబేడ్కర్ మైనపు ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ వార్డులో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అంబేడ్కర్ భవన్ సభ్యులు పలు సమస్యలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు



విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలే అవుట్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూలమూర్తికి పంచామృతాలతో అభిషేకం జరిపించారు. ఆలయ కమిటీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ శిరీషా శ్రీనివాస్ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమం నిర్వహించారు. అనంతరం వైభోపేతంగా పల్లకీ సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు గణనాథుడిని కనులారా తిలకించి తరించిపోయారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

20న ఐటీఐలో జాబ్‌మేళా

కంచరపాలెం: కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో మేథా సర్వో డ్రైవ్స్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగాల భర్తీ కోసం శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ధ్రువపత్రాలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 99668 61476లో సంప్రదించాలని సూచించారు.

భగవద్గీతతో ప్రశాంత జీవనం



ప్రవచిస్తున్న సుశీలాజీ

విశాఖ విద్య: వేదాంత ఇన్‌స్టిట్యూట్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏయూలోని వైవీఎస్‌మూర్తి ఆడిటోరియంలో భగవద్గీత 10వ అధ్యాయం 'విభూతి యోగం'పై ఇంగ్లిష్‌లో ఐదు రోజుల జ్ఞాన యజ్ఞం(ప్రవచనాలు) బుధవారం ప్రారంభమయ్యాయి. స్వామి పార్థసారథి శిష్యురాలైన సుశీలాజీ ప్రవచిస్తూ నిజ జీవితంలో ప్రశాంత జీవితం గడపడానికి కావాల్సిన మెళకువలు తెలిపే తత్వజ్ఞానాన్ని అందించేదే భగవద్గీతని చెప్పారు. విభూతి యోగంలోని 42 శ్లోకాలు, వాటి భావాలను నిత్య జీవితంలో ఎలా ఆచరించాలో తెలియజేశారు. ముందుగా భజన కీర్తనలు ఆలపించారు. అధిక సంఖ్యలో నగరవాసులు, వేదాంత ఇన్‌స్టిట్యూట్ విశాఖపట్నం ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య మురళీ అంత్యక్రియలు



విలపిస్తున్న మురళీ కుమార్తె

మల్కాపురం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉరుకూటి మురళీకృష్ణయాదవ్ మృత దేహాన్ని బుధవారం ఉదయం మల్కాపురం తీసుకువచ్చారు. 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి ప్రాంతానికి చెందిన మురళీ ఈ నెల 14న స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం అదుపు తప్పి బ్రెయిన్ డెడ్ అయిన సంగతి తెలిసిందే. అయితే అతడిని కుటుంబ సభ్యులు అవయవాలను జీవన్‌దాన్ ద్వారా అందించారు. దీంతో తాను మరణించినా నలుగురు జీవితాలను నిలిపిన మురళీ భౌతిక కాయాన్ని చూసేందుకు కుటుంబ సభ్యులే కాకుండా మల్కాపురం ప్రాంతానికి చెందిన వారు బారులు తీరారు. చినుకులను సైతం లెక్క చేయకుండా అంతిమయాత్రలో పాల్గొన్నారు.

శ్రామిక్ కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ

తాటిచెట్లపాలెం : ఇటీవల దేశవ్యాప్తంగా రైల్వేలో జరిగిన సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికల్లో ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్‌లో శ్రామిక్ కాంగ్రెస్ విజయం సాధించింది. ఈ సందర్భంగా బుధవారం యూనియన్ నాయకులు రైల్వేస్టేషన్ నుంచి డీఆర్‌ఎం కార్యాలయం వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్మికులకు అండగా నిలుస్తామని, ఇంతటి విజయాన్ని అందించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. యూనియన్ డివిజనల్ కో ఆర్డినేటర్ టీవీ మాలీశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ ఆర్‌సీ సాహు, జోనల్ ప్రెసిడెంట్ సంపత్‌కుమార్, ఆయా బ్రాంచిల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

హార్బర్‌లో ప్లాస్టిక్ వినియోగించొద్దు

మహారాణిపేట: జనవరి 1 నుంచి ఫిషింగ్ హార్బర్, ఫిషింగ్ బోట్లలో ప్లాస్టిక్ వినియోగించరాదని మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు అన్నారు. హార్బర్‌లో బుధవారం బోటు యజమానులు, చేపల వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జనవరి 1 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం నిషేధం అమల్లోకి వస్తుందని చెప్పారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'గ్రామీణ స్థానిక ప్రభుత్వ సంస్థల్లో సమాంతర వ్యవస్థల పాత్ర, ప్రాముఖ్యత' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమ బ్రోచర్‌ను బుధవారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆవిష్కరించి మాట్లాడారు. అత్యంత ప్రాధాన్యం కలిగిన అంశంపై సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. సదస్సు సంచాలకులు ఆచార్య పేటేటి ప్రేమానందం మాట్లాడుతూ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సహకారంతో వచ్చే ఏడాది ఫిబ్రవరి 10, 11 తేదీల్లో సెమినార్ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు ,అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వరకుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, సదస్సు సహ సంచాలకుడు డాక్టర్ టి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన డీసీపీ రాకేష్ ప్రసాద్‌కు సత్కారం



హెచ్ఎస్ఎల్ నూతన డీసీపీ రాకేష్‌ప్రసాద్‌ను సత్కరిస్తున్న బీఎంఎస్ నాయకులు

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ నూతన డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన కమోడోర్ రాకేష్‌ప్రసాద్‌ను బుధవారం బీఎంఎస్ నాయకులు కలిసి ఘనంగా సత్కరించారు. పలు విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు ఎల్ అండ్ ఎం సీరిస్ ఉద్యోగులను పర్మినెంట్ చేసే విధంగా కృషి చేయాలని కోరారు. కార్మికులు క్రిస్మస్, సంక్రాంతి పండగను ఆనందోత్సాహాలతో చేసుకునే విధంగా లీవ్ క్యాష్‌మెంట్ ఇప్పించే విధంగా కృషి చేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ బీఎంఎస్ జనరల్ సెక్రటరీ సుధాకర్, ప్రెసిడెంట్ సింహాచలం, నాయకులు నాగేశ్వరరావు, శ్యామ్‌బాబు, రవికుమార్, దుర్గాప్రసాద్, జైకాంత్, రమేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్పందించారు

సాక్షి ఎఫెక్ట్..





ఎయిర్‌పోర్టు నుంచి ఎన్‌ఏడీ సెంటర్ వైపు వచ్చే మార్గంలోని గ్రీన్ బెల్ట్ పరిరక్షణపై అధికారులు ఎట్టకేలకు స్పందించారు. కాకానినగర్ ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్‌కు సమీపంలో ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని తమ సొంత అవసరాల కోసం ఓ ఇంటి యజమాని పచ్చని చెట్లను నేలకూల్చిన వైనంపై 'సాక్షి'లో వచ్చిన వరుస కథనాలతో జీవీఎంసీ, ఉద్యానవన విభాగం అధికారులు రంగంలోకి దిగారు. చెట్లు నరికిన గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో మొక్కలు నాటించి వాటిని పరిరక్షించే బాధ్యతలను కూడా ఆ ఇంటియజమానికి అప్పగించారు. గ్రీన్‌బెల్ట్‌లో ఏ ప్రదేశంలో అయితే మొక్కలు నరికేశారో.. అదే చోట మొక్కలు పెంచేలా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం ఈ పనులు చేపడుతున్నారు. సాక్షి కథనంతోనైనా అధికారుల్లో చలనం వచ్చిందని పరిసర కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

\- విశాఖ విద్య



గ్రీన్ బెల్ట్‌లో చెట్లు నరికి వేయడంతో ఇలా...



గ్రీన్ బెల్ట్‌లో చెట్లు నరికి వేసి చదును చేసిన దృశ్యం

ఇక్కడ ఏ 'మందు' దొరుకునో..!



మద్యం దుకాణంపై మెడికల్ షాపు బోర్డు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్‌కు సమీపంలో గోపాలపట్నం వైపు వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఆనుకొని మద్యం దుకాణం నిర్వహిస్తున్నారు. అయితే దీనిపై మెడికల్ షాపు అని బోర్డు దర్శనమిస్తుండడంతో అంతా ఆశ్చర్యంగా చూస్తున్నారు. వైన్ షాపుపై ఇదేంటి చెప్మా అంటూ తలగోక్కుంటున్నారు. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేసిన నిర్వాహకులు దాన్ని విస్తరించే క్రమంలో పక్కన ఉన్న మరో షెల్టర్‌ను అనుసంధానం చేసుకున్నారు. దీనిలో భాగంగా అక్కడ నిర్వహిస్తున్న మెడికల్ షాపును ఖాళీ చేయించారు. కానీ దుకాణం ముందు ఉన్న బోర్డును మాత్రం తొలగించకుండా అలానే వదిలేశారు. దీన్ని చూసిన వారంతా ఇక్కడ ఏ మందు దొరుకుతుందో అంటూ గుసగుస లాడుకుంటున్నారు.

21న దూదేకుల జన గర్జన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నూర్ బాషా దూదేకుల సంఘం ప్రతినిధులు

సీతంపేట : ఏళ్ల తరబడి గుర్తింపు కోసం పోరాటం చేస్తున్న నూర్ బాషా దూదేకుల ముస్లిం సంఘాలు జన గర్జనకు పిలుపునిచ్చాయి. ఈ నెల 20, 21న ప్లీనరీ సమావేశం, జన గర్జన నిర్వహించి తమ ఐక్యతను చాటాలని నిర్ణయించినట్లు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ సుభాన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్లు బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న ఉదయం పెందుర్తి ప్రశాంత్‌నగర్ పోర్టు కల్యాణ మండపంలో రాష్ట్ర నూర్ బాషా దూదేకుల సంఘ ప్రతినిధుల ప్లీనరీ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. 21న ఉదయం పెందుర్తి వుడా లే అవుట్ పార్కు గ్రౌండ్‌లో జన గర్జన నిర్వహిస్తామని తెలిపారు. దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, చట్ట సభల్లో, సామాజిక, ఆర్థిక రంగాల్లో తగు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. జన గర్జనలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దూదేకుల, ముస్లిం, బీసీ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఉత్తరాంధ్ర కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ గర్జన కార్యక్రమాన్ని ముస్లిం బీసీ ప్రజలంతా జయప్రదం చేసి ఐక్యత చాటాలని కోరారు.

ఫోకస్



మర్రిపాలెం రైల్వే స్టేషన్ నుంచి ఎన్‌ఏడీ సెంటర్‌కు వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్‌లో కరాస వద్ద రహదారిపై భారీ గొయ్యి ప్రమాదకరంగా ఉంది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరమ్మతుల కోసం గొయ్యి తీసిన సిబ్బంది దాన్ని పూర్తిగా పూడ్చకుండా వదిలేశారు. దీంతో అది ప్రమాదభరితంగా మారింది. అటుగా వచ్చే వాహనదారులు గొయ్యి ముందు ఒక్కసారిగా బ్రేక్ వేయాల్సి రావడంతో ప్రమాదానికి గురవుతున్నారు.రాత్రి వేళలో గుంతను గుర్తించలేక వాహనదారులు దానిలో పల్టీ కొడుతున్నారు. అధికారులు స్పందించి గొయ్యి పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

\- విశాఖ విద్య

వ్యాధులపై అప్రమత్తత అవసరం

అల్లిపురం: ఎన్‌సీడీ 3.0 సర్వే, ఆర్‌బీఎస్‌కే స్కూల్ విజిట్స్, ఏడబ్ల్యూసీ స్క్రీనింగ్ తదితర అంశాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు కొబ్బరితోట పట్టణ ఆరోగ్య కేంద్రంలో సమీక్షించారు. ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్‌సీడీ 3.0 సర్వేపై సమీక్షిస్తూ వైద్యాధికారులకు, ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. పట్టణ ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలితే తక్షణమే సంబంధిత వైద్యాధికారికి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి తెలియజేయాలని కోరారు. అలా చేస్తే తగిన చర్యలు తీసుకునేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీపీవో శశిభూషణ్, వైద్యులు పాల్గొన్నారు.

సిరులతల్లి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు



ప్రత్యేక పూజలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: మార్గశిర మాస మూడో గురువారం కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. టౌన్ కొత్త రోడ్డు నుంచి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రీడింగ్ రూమ్ వద్ద ధర్మదర్శనంతోపాటు రూ.100 శీఘ్ర దర్శనం, రూ.200 ప్రత్యేక దర్శనంతో పాటు రూ.500 ఉత్సవ ప్రత్యేక దర్శనం ప్రవేశ క్యూలైన్ల టికెట్లు ఇస్తారు. సీతారామస్వామి ఆలయం వైపు నుంచి వీవీఐపీ, వీఐపీతోపాటు వృద్ధులు, వికలాంగులు, రూ.200, రూ.500 టికెట్ తీసుకున్న వారికి దర్శనం కల్పించనున్నారు. అమ్మవారి ఆలయ వెనుక భాగం, ఆలయ ప్రధాన ద్వారం (వీటీ కాలేజ్ వద్ద), దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయ సమీపంలో పోలీస్ అవుట్ పోస్ట్ తోపాటు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ మంచినీటి సదుపాయం ఏర్పాటు చేశారు. టౌన్‌కొత్తరోడ్డు, ఘోషాస్పత్రి, అమ్మవారి ఆలయం వెనుక భాగంతో పాటు పలు ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పోలీసుల బందోబస్త్ ఏర్పాటు చేశారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి తెలిపారు. బుధవారం ఆమె సాక్షితో మాట్లాడుతూ అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్న దృష్ట్యా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

అధిక వడ్డీ పేరుతో మోసం

- సీపీకి ఫిర్యాదు చేసిన బాధితులు

అల్లిపురం: అధిక వడ్డీలు ఆశ చూపి రూ.4 కోట్లతో వివాహిత పరారైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... అమ్మవారి వీధికి చెందిన మజ్జి ముత్యాలు భర్త, పిల్లలతో కలిసి సొంత ఇంట్లో నివసిస్తుంది. ఆమె గత రెండు సంవత్సరాలుగా స్థానిక మహిళలు, చిన్న చిన్న పనులు చేసుకునే వారి నుంచి అధిక వడ్డీల పేరుతో సుమారు రూ.4 కోట్లు వసూలు చేసింది. ఇటీవల ఆమె భర్త, పిల్లలను వదిలిపెట్టి స్థానికంగా గల సేనాపతి అప్పారావుతో కలిసి పరారైంది. దీంతో బాధితులు జి.వరలక్ష్మి, బి.జయలక్ష్మితో కలిసి వారం రోజుల క్రితం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పొదుపు సంఘానికి కూడా ఆమె కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ప్రతి నెల పొదుపు సంఘానికి చెందిన పది మంది మహిళలు కట్టే డబ్బులు కూడా ఆమె బ్యాంకులో జమ చేయలేదని తేలింది. గత ఏడాది కాలంగా పొదుపు డబ్బులు కట్టకున్నా యుసీడీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముత్యా లుపై టూటౌన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు కనీసం చర్యలు తీసుకోనందున పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి ఫిర్యాదు చేశామని తెలిపారు. తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.